క్లుప్తంగా

పారిశుద్ధ్యం మెరుగుకు చర్యలు



గ్రామస్తులకు అవగాహన కల్పిస్తున్న ఎంపీడీఓ

బుచ్చినాయుడుకండ్రిగ: మండల కేంద్రంలో పారిశుద్ధ్యం మెరుగుకు చర్యలు చేపడుతున్నట్టు ఎంపీడీఓ వెంకటరత్నమ్మ తెలిపారు. శుక్రవారం స్వచ్ఛాంధ్ర–స్వచ్ఛ దివస్ కార్యక్రమంలో భాగంగా ఆమె బుచ్చినాయుడుకండ్రిగ గ్రామస్తులకు పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పరిసరాల పరిశుభ్రత ప్రతి ఒక్కరి బాధ్యతని, శుభ్రంగా ఉంటేనే ఆరోగ్యంగా ఉంటారని తెలిపారు. డ్రైనేజీ కాలువ దెబ్బ తినడంతో మురుగునీరు వీధుల్లోకి వస్తుందని, త్వరలోనే మరమ్మతులు చేయిస్తామని హామీ ఇచ్చారు. ఈఓపీఆర్డీ రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

నేడు శనిత్రయోదశి పూజలు



లత

నాగలాపురం: మండలంలోని సురుటుపల్లి గ్రామంలో ప్రదోష క్షేత్రంగా భాసిల్లుతున్న శ్రీసర్వ మంగళ సమేత శ్రీపల్లికొండేశ్వర స్వామి ఆలయంలో శనివారం సాయంత్రం శనిత్రయోదశి ప్రదోష పూజలు జరుగుతాయని ఆలయ కార్యనిర్వహణ అధికారి లత తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సాయంత్రం 4 నుంచి 6 గంటల వరకు ప్రదోష మండపంలో నందీశ్వరునికి, వాల్మీకీశ్వర స్వామికి, మరగదాంబిక అమ్మవారికి ఏకకాలంలో విశేషాలంకారాలు, అభిషేకాలు, మహాహారతి కార్యక్రమాలు నిర్వహిస్తామని అన్నారు. ప్రదోష పూజలో పాల్గొనదలచిన వారు రూ.500 చెల్లించి రసీదు పొందాలని తెలిపారు.

ముక్కంటి ఆలయానికి బొలేరో



బొలేరో వాహనాన్ని అందజేస్తున్న నవయుగ కంపెనీ ప్రతినిధులు

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయానికి నవయుగ కంపెనీ వారు శుక్రవారం రూ.13.50 లక్షలు విలువ చేసే బొలేరో వాహనాన్ని అందజేశారు. దీనిని ఆలయాధికారులు స్వీకరించి దాతలకు కృతజ్ఞతలు తెలిపారు. వారికి స్వామి, అమ్మవార్ల దర్శన ఏర్పాట్లు చేసి, తీర్థప్రసాదాలు అందజేశారు.

సైనిక్ స్కూల్‌కు విద్యార్థినుల ఎంపిక



గురుసాత్విక



గగన

శ్రీకాళహస్తి: పట్టణంలోని జయరాంరావు వీధిలోని శ్రీ సరస్వతీ బాయ్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఆరో తరగతి చదువుతున్న విద్యార్థినులు జనమాల గురుసాత్విక, ఎస్ గగన సైనిక్ స్కూల్‌కు ఎంపికయ్యారు. ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయులు బృందాదేవి, ఉపాధ్యాయులు విద్యార్థినులను అభినందించారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం మాట్లాడుతూ ఈ విజయం తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల సహకారంతోనే సాధ్యమైందన్నారు.

కండలేరులో 42.304 టీఎంసీలు

రాపూరు: కండలేరు జలాశయంలో శుక్రవారం నాటికి 42.304 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు ఈఈ విజయకుమార్‌రెడ్డి తెలిపారు. కండలేరు నుంచి సత్యసాయి గంగ కాలువకు 2,250, పిన్నేరు కాలువకు 20, లోలెవల్ కాలువకు 60, హైలెవల్ కాలువకు 20, మొదటి బ్రాంచ్ కాలువకు 85 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్లు తెలిపారు.

రుణాలు.. బహుదూరం

బీసీ, ఈబీసీల్లోని నిరుద్యోగ యువతకు స్వయం ఉపాధి కల్పించేందుకు సబ్సిడీ రుణాలందిస్తామని చెప్పిన కూటమి ప్రభుత్వం మరో ఏడాది తాత్సారం చేసేలా ఉంది. సబ్సిడీ కింద మంజూరు చేయాల్సిన రుణాల కోసం నిధులు విడుదల చేయలేక ఇప్పటివరకు జరిగిన ప్రక్రియను ఎక్కడికక్కడ ఆపేయాలని ప్రభుత్వం మౌఖికంగా ఆదేశించింది. తదుపరి ఉత్తర్వులు జారీ చేసే వరకు చర్యలు చేపట్టొద్దని సూచన ప్రాయంగా చెప్పింది. ఇప్పటికే అరకొర యూనిట్ల కేటాయింపు, ఆపై నేతల జోక్యంతో తలలు పట్టుకుంటున్న పరిస్థితుల్లో ప్రభుత్వం తాజా ఆదేశాలు ఇవ్వడంతో కొన్నాళ్లు ఒత్తిళ్లు తప్పుతాయని అధికారులు భావిస్తున్నారు.

–వరదయ్యపాళెం





వరదయ్యపాళెంలో బీసీ కార్పొరేషన్ రుణాల ఇంటర్వ్యూలు (ఫైల్), నాగలాపురంలో ఇంటర్వ్యూలకు హాజరైన నిరుద్యోగ యువత (ఫైల్)

- బీసీ, ఈబీసీ రుణాలకు ఈ ఏడాది బ్రేక్ పడినట్టేనా?
- నిధులు లేక ఎక్కడికక్కడ ఆపివేయమన్న ప్రభుత్వం
- తదుపరి ఆదేశాలు వచ్చేవరకు రుణాలు లేవు
- వెనకబడిన వర్గాలకు మరోసారి నిరాశ



వరదయ్యపాళెంలో బీసీ కార్పొరేషన్ రుణాలకు ఇంటర్వ్యూ చేస్తున్న బ్యాంకు అధికారులు (ఫైల్)

నిరుద్యోగులకు ఉద్యోగాలు ఇస్తామని.. ఆలోపు రూ.3 వేల నిరుద్యోగ భృతి అందజేస్తామని ఎన్నికల వేళ ప్రగల్భాలు పలికిన కూటమి నాయకులు పదవిలోకి వచ్చాక ఆ హామీలను గాలికొదిలేశారు. ఉద్యోగాలు, నిరుద్యోగ భృతి పక్కన పెడితే విధిగా ఇవ్వాల్సిన సంక్షేమ పథకాలనూ ఎగ్గొట్టేస్తున్నారు. ఈ క్రమంలోనే వెనకబడిన వర్గాలకు చెందిన నిరుద్యోగ యువతకు సబ్సిడీ రుణాలిస్తామని తొలుత హడావుడి చేశారు. దరఖాస్తులు ఆహ్వానించినప్పటికీ.. బ్యాంకు అధికారులు, ఇతర శాఖల అధికారులతో సంబంధం లేకుండా ఎమ్మెల్యేల ఆదేశాలతో మండల టీడీపీ నాయకులే ఫైనల్ చేసే పరిస్థితులు ఏర్పడ్డాయి.

భారీగా దరఖాస్తులు.. అరకొరగా యూనిట్లు

నియోజకవర్గంలో ఎక్కువగా వెనకబడిన వర్గాల వారే ఉన్నారు. ఆ మేరకు అత్యధికంగా సత్యవేడు నియోజకవర్గానికి రుణ యూనిట్లు అధికంగా కేటాయించాల్సి ఉంది. కానీ కూటమి ప్రభుత్వం 267 యూనిట్లనే కేటాయించింది. 50 శాతం సబ్సిడీతో ఇచ్చేందుకు ఉత్తర్వులు జారీ చేసింది. వాస్తవానికి, ఈ యూనిట్లు ఎటూ సరిపోవు. తక్కువ యూనిట్లు కారణంగా ప్రభుత్వం దరఖాస్తుల సమయంలోనే అనేక ఆంక్షలు పెట్టింది. చివరికి 1510 మంది నియోజకవర్గంలోని 7 మండలాల్లో దరఖాస్తు చేసుకోగలిగారు. వారందరికీ ఇంటర్వ్యూలు కూడా నిర్వహించారు. తుది ఎంపిక మాత్రం అధికార కూటమి నేతల చేతుల్లోకి వెళ్లిపోయింది. దీంతో ఎవరికి రుణం దక్కుతుందో అర్థం కాక అభ్యర్థులు ఆందోళన చెందుతున్నారు. తమకు రుణాలు మంజూరు అవుతాయోలేదోనని నిరుత్సాహం చెందుతున్నారు.

నిధుల్లేక రుణాలకు బ్రేక్

తాజాగా రుణాల మంజూరు విషయంలో ముందుకెళ్లొద్దని ప్రభుత్వం బ్రేకులు వేసింది. ఎక్కడికక్కడ ఆపేయాలని, తదుపరి ఉత్తర్వులు వచ్చేవరకు ఎటువంటి చర్యలు తీసుకోవద్దని మౌఖిక ఆదేశాలు ఇచ్చింది. సబ్సిడీ కింద నిధులు విడుదల చేసే పరిస్థితి లేకపోవడంతోపాటు అరకొర యూనిట్లతో ప్రజల నుంచి తీవ్ర వ్యతిరేకత వస్తుందని తాజా నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. దీంతో ఈ ఏడాది బీసీ, ఈబీసీలకు రుణాల కేటాయింపుపై సందేహాలు కమ్ముకుంటున్నాయి. అంతేకాక

సత్యవేదు నియోజకవర్గంలో మండలాల వారీగా ప్రభుత్వం కేటాయించిన బీసీ కార్పొరేషన్ యూనిట్లు, దరఖాస్తులు

మండలం	కేటాయించిన యూనిట్లు	దరఖాస్తులు
పిచ్చాటూరు	34	167
నాగలాపురం	35	250
సత్యవేడు	62	380
బీఎన్‌కండ్రిగ	29	300
నారాయణవనం	25	50
వరదయ్యపాళెం	41	195
కేవీబీపురం	41	168

ప్రభుత్వం బ్యాంకులకు విడుదల చేయాల్సిన సబ్సిడీ రుణాన్ని జమ చేయకపోవడంతో రుణాలను లబ్ధిదారులకు మంజూరు చేయలేని పరిస్థితి నెలకొంది.

వాయిదా పడ్డ ఇంటర్వ్యూలు

అలాగే ఎస్సీ కార్పొరేషన్ ద్వారా రుణాలు మంజూరు చేస్తున్నట్లు గత ఏప్రిల్ నెలలో హడావిడి చేశారు. దరఖాస్తులు సైతం ఆన్‌లైన్‌లో స్వీకరణ జరిగాయి. ఎంతో ఉత్సాహంగా ఎస్సీ కార్పొరేషన్ ద్వారా రుణాలను పొందేందుకు దరఖాస్తు చేసుకున్నారు. అయితే ఈ నెల 10వ తేదీన జరగాల్సిన ఇంటర్వ్యూలు వాయిదా పడడంతో దరఖాస్తుదారుల ఆశలు అడియాశలు అయ్యాయి. దీంతో ఈ ఏడాది తమకు రుణాలు అందవన్న నిరుత్సాహంలో ఆ వర్గం వారు ఉన్నారు.

సబ్సిడీ రుణాలు విడుదల చేయాలి



వెనుకబడిన వర్గాలకు మంజూరు చేసిన బీసీ కార్పొరేషన్ యూనిట్లకు సంబంధించి ప్రభుత్వం ద్వారా బ్యాంకులకు విడుదల చేయాల్సిన సబ్సిడీ మొత్తాన్ని వెంటనే విడుదల చేయాలి. సబ్సిడీ నగదు విడుదల అయితేనే బ్యాంకు వారు యూనిట్లను లబ్ధిదారులకు గ్రౌండింగ్ చేస్తారు. ఇంటర్వ్యూలు నిర్వహించి 3 నెలలు పూర్తవుతున్నా ఇంతవరకు రుణాలు పంపిణీ చేయకపోవడం దారుణం. బీసీ వర్గాలను ఓటు బ్యాంకుగా మార్చుకునేందుకు చూపే శ్రద్ధ వారికి లబ్ధి చేకూరే పథకాలపై చూపకపోవడం చంద్రబాబు మోసాలకు పరాకాష్ట. తక్షణమే ప్రభుత్వం స్పందించాలి.

–నూకతోటి రాజేష్, వైఎస్సార్ సీపీ సమన్వయకర్త, సత్యవేడు నియోజకవర్గం

యువతకు అన్యాయం



బీసీల ఓట్లతో గద్దెనెక్కిన కూటమి ప్రభుత్వం ఆ వర్గాల వారిని మోసం చేస్తోంది. అందుకు నిదర్శనం మూడు నెలల క్రితం బీసీ కార్పొరేషన్ రుణాలకు ఇంటర్వ్యూలు నిర్వహించి నేటి వరకు అందించకపోవడమే. ఎన్నికల హామీల్లో ఇచ్చిన నిరుద్యోగ భృతి హామీని అటకెక్కించారు. తక్షణమే అర్హత కలిగిన వారికి రుణాలు పంపిణీ చేయాలి.

–దేవేళ్ల మహేంద్ర, బీసీ నాయకుడు, వరదయ్యపాళెం మండలం

ఉన్నం వాసుదేవ నాయుడికి ఎమ్మెల్యే పరామర్శ

శ్రీకాళహస్తి: వైఎస్సార్ సీపీ ఉమ్మడి చిత్తూరు జిల్లా ప్రధాన కార్యదర్శి, తొట్టంబేడు మండలాధ్యక్షుడు ఉన్నం వాసుదేవనాయుడు అనారోగ్యానికి గురైన చికిత్స పొంది ఇంట్లో విశ్రాంతి తీసుకుంటున్నారు. శుక్రవారం శ్రీకాళహస్తి మాజీ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి, శ్రీకాళహస్తీశ్వరాలయ పాలకమండలి మాజీ చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు ఆయన్ని పరామర్శించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ కోవి చంద్రయ్యనాయుడు, పీఏసీఎస్ మాజీ చైర్మన్ మణినాయుడు, భాస్కర్ ముదిరాజ్, మణి, పగడాల రాజు, శరవణకుమార్, కంఠా ఉదయ్‌కుమార్, మున్నారాయల్, సురేష్, పఠాన్ ఫరీద్, ఫజల్, షేక్ గఫూర్, రవి, పెరుమాల్, అస్లాం, జీవీకేరెడ్డి, బావాజీ, సాధిక్, యాకూబ్ తదితరుల పాల్గొన్నారు.



ఉన్నం వాసుదేవనాయుడిని పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి

మృతుని కుటుంబానికి పరామర్శ

శ్రీకాళహస్తి: పట్టణంలోని పెద్దమసీదు వీధిలో ఉన్న కటికం కేశవులు అనారోగ్యంతో శుక్రవారం మరణించారు. విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి అక్కడికి చేరుకుని, మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు. శ్రీకాళహస్తీశ్వరాలయ పాలకమండలి మాజీ చైర్మన్ అంజూరు శ్రీనివాసులు, వైఎస్సార్ సీపీ నాయకులు పగడాల రాజు, సాధన మున్నారాయల్, శ్రీవారి సురేష్, కంఠా ఉదయ్‌కుమార్, ఉత్తరాజి శరవణకుమార్, విజయకుమార్‌రెడ్డి, షఫీ తదితరులు సంతాపం తెలిపారు.

శరవేగంగా భూముల రీసర్వే

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని తిమ్మభూపాలపురం గ్రామ రెవెన్యూలో భూముల రీసర్వే కార్యక్రమం శరవేగంగా సాగుతోందని ఆర్ఎస్ డీటీ చంద్రబాబునాయుడు తెలిపారు. ఆయన శుక్రవారం తిమ్మభూపాలపురం గ్రామ రెవెన్యూలో జరుగుతున్న భూముల రీసర్వేను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తిమ్మభూపాలపురం గ్రామ రెవెన్యూ పరిధిలోని తిమ్మభూపాలపురం గ్రామంలో 384.98 ఎకరాల భూమిని రీసర్వే చేస్తున్నామని, త్వరలో చల్లమాంబపురం గ్రామంలో 265.55 ఎకరాల భూమిని రీ సర్వే చేస్తామని తెలిపారు. భూమి కొలతలు పక్కాగా ఉంటాయని, హద్దు రాళ్లను ఏర్పాటు చేస్తామని తెలిపారు. సర్వే అధికారులు ఎలాంటి సమస్యలు తలెత్తకుండా చూడాలన్నారు. భూముల రీసర్వేకు రైతులు సహకరించాలన్నారు. ఈ కార్యక్రమంలో సర్వేయర్ రాజ్ కుమార్, వీఆర్‌ఓలు పాల్గొన్నారు.



రీసర్వేలో రికార్డులను పరిశీలిస్తున్న ఆర్ఎస్‌డీటీ చంద్రబాబునాయుడు

నీటి మడుగు కాదు.. రోడ్డే!



పాండూరు–వరదయ్యపాళెం రోడ్డు మార్గంలో బావిని తలపించేలా నీటిగుంత

వరదయ్యపాళెం: పెద్ద పాండూరు–వరదయ్యపాళెం వెళ్లే ప్రధాన ఆర్అండ్‌బీ రోడ్డు మార్గంలో రెండు రోజులుగా కురుస్తున్న స్వల్ప వర్షాలకు మడుగులను తలపించే విధంగా నీటి గుంటలు ఏర్పడ్డాయి. ప్రధానంగా త్రయంబకేశ్వరాలయం నుండి వరదయ్యపాళెం హైస్కూల్ వరకు వర్షపునీటి నిల్వలతో బావులను తలపించే విధంగా గుంతలు ఉన్నాయి. వాహనదారులు రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నారు. కనీసం ప్రస్తుత వేసవిలో కూడా గుంతలు పూడ్చకపోవడంతో రాబోయే రోజుల్లో పరిస్థితి ఇబ్బందికరంగా మారుతుందని స్థానికులు ఆవేదన చెందుతున్నారు. ఓవైపు పల్లె పండుగ పేరుతో రోడ్లు అభివృద్ధి చేస్తామని కూటమి ప్రభుత్వం బాకా వాయిస్తున్నప్పటికీ అది క్షేత్రస్థాయిలో అమలుకు నోచుకోవడం లేదు. ఇప్పటికైనా రోడ్ల అభివృద్ధి గురించి స్పందించాలని స్థానికులు కోరుతున్నారు.

గాయపడిన మహిళ మృతి

రేణిగుంట: ఇంట్లో వంట చేస్తున్న సమయంలో ప్రమాదవశాత్తు చీరకు నిప్పంటుకుని భార్యాభర్తల కు తీవ్ర గాయాలై ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న మహిళ మృతి చెందింది. రేణిగుంట మండలం వెదళ్లచెరువు ఎస్టీ కాలనీలోని రేకుల ఇంట్లో సుబ్బయ్య, రాణి దంపతులు కాపురం ఉంటున్నారు. మంగళవారం ఉదయం వంట చేస్తున్న సమయంలో ప్రమాదవశాత్తు రాణి చీరకు నిప్పు కుంది. దీంతో ఆమె కేకలు వేయడంతో మంటను ఆర్పేందుకు ప్రయత్నించాడు. అయినా భార్యాభర్తలకు గాయాలయ్యాయి. వారిని తిరుపతి రుయా ఆస్పత్రికి తరలించి, చికిత్స అందించారు. చికిత్స పొందుతున్న రాణి (35) శుక్రవారం మృతి చెందింది. రేణిగుంట పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

కిశోరి వికాసంపై బాలికలకు అవగాహన



అవగాహన ర్యాలీ చేస్తున్న సిబ్బంది

రేణిగుంట: మహిళా శిశు సంక్షేమ విభాగం ఆధ్వర్యంలో రేణిగుంట మండలంలోని అన్నాస్వామి పల్లి, ఇందిరానగర్ అంగన్‌వాడీ కేంద్రాల్లో శుక్రవారం బాలికలకు కిశోరి వికాసంపై అవగాహన కల్పించారు. అనంతరం గ్రామాల్లో అవగాహన ర్యాలీ చేశారు. అంగన్‌వాడీ సూపర్‌వైజర్ హేమావతి మాట్లాడుతూ బాలికలు ఒక లక్ష్యాన్ని నిర్దేశించుకుని ఇప్పటి నుంచే లక్ష సాధన కోసం కృషి చేయాలని తెలిపారు. ఎటువంటి ప్రలోభాలకు లోను కాకుండా విద్యను కొనసాగించాలని కోరారు. కార్యక్రమంలో మహిళా సంరక్షణ కార్యదర్శి షర్మిల, ప్రగతి కోఆర్డినేటర్ జయలక్ష్మి, ఏఎన్‌ఎం ఆనంద్ కుమారి, అంగన్‌వాడీ కార్యకర్తలు గురమ్మ, కోమల, ఆశా వర్కర్ ముని పూర్ణ, చెంచమ్మ, అమరావతి తదితరులు పాల్గొన్నారు.

శాస్త్రోక్తంగా శుక్రవార ఉత్సవం



ఊరేగుతున్న అమ్మవారు

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయలలో శుక్రవారం పురస్కరించుకుని జ్ఞానప్రసూనాంబ అమ్మవారికి శుక్రవార ఉత్సవం శాస్త్రోక్తంగా నిర్వహించారు. అలంకార మండపంలో అమ్మవారి ఉత్సవమూర్తిని ప్రత్యేకంగా అలంకరించారు. అనంతరం ఆలయంలో ప్రాకారోత్సవం జరిపారు. తరువాత ఆలయంలో కొలువు తీర్చారు. భక్తులు పెద్దసంఖ్యలో అమ్మవారిని దర్శించుకున్నారు.

ముక్కంటికి లడ్డూ ట్రేలు, గ్రైండర్ అందజేత

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయానికి శుక్రవారం నెల్లూరు జిల్లా వెంకటాచలం గ్రామానికి చెందిన సారంగం రామచంద్రయ్య, సారంగం ప్రమీలమ్మ అనే భక్తులు రూ.91 వేలు విలువ చేసే వంద లడ్డూ, పులిహోర సరఫరా చేసే ట్రేలు, గ్రైండర్‌ను విరాళంగా అందజేశారు. వీటిని ఆలయాధికారులు స్వీకరించి, దాతలకు కృతజ్ఞతలు తెలిపారు. స్వామి అమ్మవార్ల దర్శన ఏర్పాట్లు చేశారు.



లడ్డూ ట్రేలు అందజేస్తున్న దాత

వేడుకగా పోలేరమ్మ జాతర

ఏర్పేడు: మండలంలోని నాగంపల్లిలో శుక్రవారం గ్రామదేవత పోలేరమ్మ జాతర ఘనంగా నిర్వహించారు. అమ్మవారికి విశేష అభిషేకాలు చేసి, శోభాయమానంగా అలంకరించారు. భక్తులు పొంగళ్లు పెట్టి, నైవేద్యం సమర్పించి, మొక్కులు తీర్చుకున్నారు. స్థానికుల ఆహ్వానం మేరకు నాగంపల్లికి విచ్చేసిన ఎమ్మెల్సీ డాక్టర్ సిపాయి సుబ్రమణ్యం అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయ పెద్దలు ఆయన్ని శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో పాగాలి సర్పంచ్ గాది రాజేశ్వరి, నరసింహులురెడ్డి, గంగాధర్‌రెడ్డి, భరత్, ఉమామహేశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



పోలేరమ్మను దర్శించుకుంటున్న ఎమ్మెల్సీ సిపాయి సుబ్రమణ్యం

టీటీడీ కల్యాణ మండపం పనులకు శ్రీకారం

సత్యవేడు: నియోజవర్గ కేంద్రమైన సత్యవేడులో టీటీడీ కల్యాణ మండపం నిర్మాణానికి అన్ని అడ్డంకులు తొలగడంతో పనులు ప్రారంభిస్తున్నట్లు డీఈ భాస్కర్ తెలిపారు. శుక్రవారం ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం, స్థానిక నాయకులు, భవన కాంట్రాక్టర్ సి.విక్రమ్‌తో కలసి పనులను పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సోమవారం నుంచి పనులు ప్రారంభిస్తారన్నారు. కల్యాణ మండపానికి టీటీడీ నిధులు రూ.2 కోట్లు మంజూరయ్యాయన్నారు. సర్వే నెంబరు 352–2లో 92 సెంట్లు స్థలంలో టీటీడీ కల్యాణ మండపం నిర్మిస్తున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో తహశీల్దారు రాజశేఖర్, ఏఈ గురుప్రసాద్, సర్పంచ్ రమేష్, సెక్రటరీ మునిరవికుమార్, వీకేఎస్ పరమశివం(బాషా), శశినాయుడు, చికెన్ చిన్నా(మురళి), రమణయ్య, బాలమురళీకృష్ణ, మోహన్ బాబు, శివానందం, జయశంకర్, లాయర్ రాజ, సుబ్రమణ్యం, జయశంకర్ తదితరులు పాల్గొన్నారు.



కల్యాణ మండపం ప్లాన్‌ను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే

అదనపు గదులు నెలాఖరుకల్లా పూర్తి చేయండి

ఏర్పేడు: ప్రభుత్వ పాఠశాలల్లో నిర్మిస్తున్న అదనపు తరగతి గదులు, సైన్స్ ల్యాబ్, కిచెన్ గార్డెన్ తదితర పనులను ఈనెలాఖరుకల్లా పూర్తి చేయాలని సమగ్ర శిక్ష జిల్లా అడిషనల్ ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ గౌరీ శంకర్ ఆదేశించారు. ఏర్పేడు మండలంలోని ఏర్పేడు, పల్లం జెడ్పీ ఉన్నత పాఠశాలలను ఆయన శుక్రవారం సందర్శించి, సర్వశిక్ష కార్యక్రమంలో జరుగుతున్న పనులను పరిశీలించారు. విభిన్న ప్రతిభావంతుల అభ్యున్నతి కోసం మంజూరైన ఆటిజం సెంటర్, సైన్స్ ల్యాబ్, తరగతి గదులను పరిశీలించారు. ఆయన వెంట జిల్లా అకడమిక్ మానిటరింగ్ ఆఫీసర్ శివ శంకరయ్య, జిల్లా ఐఈ కోఆర్డినేటర్ చంద్రశేఖర్, ఎంఈఓలు ప్రేమలత, దయాకర్, హెచ్‌ఎంలు తీగల ఆనంద్, సునీత, ఉపాధ్యాయులు ఉన్నారు.



పల్లంలో అభివృద్ధి పనులపై హెచ్‌ఎంకు సూచనలిస్తున్న గౌరీశంకర్

ముక్కంటి సేవలో ప్రముఖులు

శ్రీకాళహస్తి: జ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరస్వామివారిని శుక్రవారం మధ్యప్రదేశ్ ఎన్నికల కమిషనర్ మనోజ్‌కుమార్ శ్రీవత్స, కడప జిల్లా కలెక్టర్ చెరుకూరి శ్రీధర్ వేర్వేరు సమయాల్లో కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. దక్షిణ గోపురం వద్ద ఆలయాధికారులు వారికి స్వాగతం పలికి, దర్శన ఏర్పాట్లు చేశారు. దర్శనానంతరం మృత్యుంజయ స్వామి సన్నిధిలో వేదపండితులు వారిని ఆశీర్వదించి స్వామి అమ్మవార్ల జ్ఞాపిక, తీర్థప్రసాదాలు అందజేశారు.

గుడిమల్లం ఆలయంలో మహారాష్ట్ర ఎన్నికల కమిషనర్

ఏర్పేడు: మధ్యప్రదేశ్ ఎన్నికల కమిషనర్ మనోజ్‌కుమార్ శ్రీవత్స శుక్రవారం ఏర్పేడు మండలం గుడిమల్లంలోని ప్రఖ్యాత శైవక్షేత్రం పరశురామేశ్వరాలయాన్ని దర్శించుకున్నారు. ఆయనకు ఆలయ ఈఓ రామచంద్రారెడ్డి, మాజీ చైర్మన్ బత్తల గిరినాయుడు స్వాగతం పలికి, ప్రత్యేక దర్శన ఏర్పాట్లు చేశారు. అనంతరం స్వామివారి తీర్థ ప్రసాదాలు అందజేశారు.



గుడిమల్లం ఆలయాన్ని దర్శించుకున్న మనోజ్‌కుమార్ శ్రీవత్స



ఆలయం వద్ద కడప జిల్లా కలెక్టర్ శ్రీధర్

వైఎస్సార్ సీపీ మండల కమిటీల నియామకం

వరదయ్యపాళెం: సత్యవేడు నియోజకవర్గంలోని 7 మండలాలకు వైఎస్సార్ సీపీ మండల కమిటీలను నియమిస్తూ శుక్రవారం సాయంత్రం పార్టీ కేంద్ర కార్యాలయం నుండి ఉత్తర్వులు వెలువడ్డాయి. పార్టీ అధ్యక్షులు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు మండల కమిటీలను నియమించినట్లు నియోజకవర్గ సమన్వయకర్త నూకతోటి రాజేష్ ఒక ప్రకటనలో తెలిపారు. సత్యవేడు మండల వైఎస్సార్ సీపీ ఉపాధ్యక్షులుగా జి.పునిదకుమార్, ఎస్.సెంథిల్ కుమార్, ప్రధాన కార్యదర్శులుగా ఎ.గురునాథం, పీడీ శరవణ, ఎం.మధుసూదనరావు, బి.ఎబినేజర్ బాబు, కార్యదర్శులుగా ఆర్.రాబిన్ రమేష్, హెచ్.గోవిందస్వామి, ఎం.సుధాకర్, కేపీ.మోహన్ రెడ్డి, ఎస్.మునస్వామి, జి.కృష్ణయ్య, సి.కనకరాజ్, జి.మునికృష్ణయ్య, 18 మంది ఎగ్జిక్యూటివ్ మెంబర్లతో మండల కమిటీని ఎంపిక చేశారు.

నారాయణవనం

ఉపాధ్యక్షులుగా టీపీ దొరైరాజ్, ఎం.అశోక్, ప్రధాన కార్యదర్శులుగా కుప్పస్వామి రెడ్డి, ఆర్.ఢిల్లీ కుమార్, మంజునాథ్, పీజీ బాబు, కార్యదర్శులుగా టి.సారకాయలు, వి.రాజ, అన్నామలై, ఇ.గోపి, పి.సుబ్రమణ్యంలతో పాటు 30 మంది ఎగ్జిక్యూటివ్ సభ్యులతో మండల కమిటీని నియమించారు.

బీఎన్‌కండ్రిగ

ఉపాధ్యక్షులుగా వై.రాజయ్య నాయుడు, వై.ప్రసాద్ పాల్, పి.మునికృష్ణయ్య, ప్రధాన కార్యదర్శులుగా వి.ప్రసాద్, ఎం.నాగూర్, ఎస్.సుధీర్‌రెడ్డి, డి.శ్రీనివాసులురెడ్డి, కార్యదర్శులుగా ఎం.శివయ్య, జె.వెంకటేశ్వర్లు, వి.యుగంధర్ రెడ్డి, సి.రమేష్‌లతోపాటు మరో 31 మందితో మండల కమిటీని నియమించారు.

వరదయ్యపాళెం

ఉపాధ్యక్షులుగా గిరి, ఆర్.బాల, ప్రధాన కార్యదర్శులుగా కె.పరంధామరెడ్డి, కె.మాధవయ్య, ఇ.మోహన్, ఎబినేజర్, కార్యదర్శులుగా ఇ.దినేష్, రారాజు, గజ, సుబ్రమణ్యం నాయుడు, సుబ్రమణ్యంలతోపాటు మరో 31 మందితో కమిటీ ఏర్పాటు చేశారు.

పిచ్చాటూరు

ఉపాధ్యక్షులుగా కె.రామచంద్రయ్య, వి.సుబ్రమణ్యం, ప్రధాన కార్యదర్శులుగా కె.కిరణ్‌కుమార్, ఎస్.మురళి, వి.ఏసుదాస్, కె.ఆర్ముగం రెడ్డి, కార్యదర్శులుగా వి.రమేష్, జి.గుణశేఖర్ అలియాస్ అయ్యప్ప, పి.చెంచురత్నం నాయుడు, ఎం.విశ్వనాథం, డి.ముద్దుకృష్ణమరాజులతో పాటు మరో 15 మంది సభ్యులతో మండల కమిటీని ఎంపిక చేశారు.

కేవీబీపురం

ఉపాధ్యక్షులుగా కె.పట్టాభిరెడ్డి, కె.గిరిబాబు, ప్రధాన కార్యదర్శులుగా వి.మహేశ్వరరావు, పి.మునిరాజ, ఆర్.మురళీమోహన్, ఎం.పరశురామ్ రెడ్డి, కార్యదర్శులుగా ఎం.వెంకటేష్, టి.మణి, కె.హేమకుమార్, డి.మునీంద్ర, పి.మోహన్‌లతో పాటు మరో 39 మంది సభ్యులతో మండల కమిటీని ఎంపిక చేశారు.

నాగలాపురం

ఉపాధ్యక్షులుగా ఎ.మురళీరెడ్డి, ఎం.మదన్‌మోహన్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శులుగా ఓ.సుబ్బరామిరెడ్డి, జి.నందారెడ్డి, ఎ.భాస్కరరాజు, కార్యదర్శులుగా వి.ఉదయ్‌రెడ్డి, ఆర్.పళని, వి.దశరథరెడ్డి, కె.సుబ్రమణ్యం రెడ్డి, పి.పళని రెడ్డిలతో పాటు మరో ఆరుగురు సభ్యులతో పాటు మండల కమిటీని నియమించారు.